7

సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం, 29, జూన్, 2023

న్యూస్‌రీల్

మోజెస్ దంపతులకు సత్కారం



మోజెస్ దంపతులను సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు

గంగవరం : రాష్ట్ర ఫెలోషిప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏగ్రక్రీవంగా ఎన్నికైన టి.మోజెస్ దంపతులను స్థానిక దైవ సన్నిధి రిలాక్స్ సెంటర్ చర్చిలో ఘనంగా సత్కరించారు. బుధవారం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు, మండల, డివిజన్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు సంతోష్ బిత్తరి, చంటిబాబు, ప్రభుదాస్ మోజెస్ సేవలను కొనియాడారు. పాస్టర్ కృపారావు, రాబర్ట్, ఎం.బాబూరావు, ప్రసాద్‌బాబు, మనోహర్, పండుదొర రంపచోడవరం, చింతూరు, పాడేరు డివిజన్లకు చెందిన 22 మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్వ హిందూపరిషత్ సభ్యులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న ఉత్తరాంధ్ర ధర్మప్రసార ప్రముఖ్ సూర్యనారాయణ

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ తోటలగొంది గ్రామంలో బుధవారం ఉత్తరాంధ్ర విశ్వ హిందూపరిషత్ ధర్మప్రసార విభాగ్ అధ్వర్యంలో గ్రామ సమితి సభ్యుల అభ్యాస వర్గ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర విశ్వ హిందూపరిషత్ ధర్మప్రసార ప్రముఖ్ సూర్యనారాయణ, ధర్మప్రసార గ్రామ కమిటీ సభ్యులకు మార్గ నిర్దేశం చేశారు. మండలంలోని పది గ్రామాలకు చెందిన 22 మంది కార్యకర్తలు అభ్యాస వర్గలో శిక్షణ పొందారు. విశ్వహిందూపరిషత్ జిల్లాధర్మప్రసార ప్రముఖ్ రీమెలి అప్పలరాజు పాల్గొన్నారు.


తాటాకిల్లు దగ్ధం.. రూ.లక్ష ఆస్తి నష్టం



కాలిపోతున్న తాటాకిల్లు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పంచాయతీలోని జమ్మిచావడి గ్రామంలో బుధవారం రాత్రి తాటాకిల్లు దగ్ధం కాగా రూ. లక్ష మేర ఆస్తి నష్టం సంభవించింది. ఇంటి యజమాని వేమా పార్వతి వంట చేస్తుండగా మంటలు ఎగసిపడటంతో ఈ ఘటన చోటుచేసుకుందని సర్పంచ్ కొంగర మురళీకృష్ణ తెలిపారు. వంట సామగ్రి, ఆహార పదార్థాలు, సమస్తం కాలిబూడిద కాగా కుటుంబసభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.


పాము కాటుతో మహిళ మృతి



సీతావీరమణి (ఫైల్)

చింతపల్లి: మండలంలోని తాజంగిలో పాము కాటుకు గురైన మహిళ బుధవారం మృతి చెందింది. పసుపు పైరులో బుధవారం సీతామీరమణి (60) కలుపు తీస్తుండగా పాము కాటుకు గురైంది. అస్వస్థతకు గురైన ఆమెను వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా ఆమె మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

నూతన భవనంలోకి ఏకలవ్య విద్యార్థులు



ఏకలవ్య పాఠశాల నూతన భవనం

చింతపల్లి: ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను నూతన భవనంలోకి తరలించామని ప్రిన్సిపాల్ అన్నామణి తెలిపారు. ఇప్పటి వరకూ స్థానిక వైటీసీలో పాఠశాలను నిర్వహించారు.ఏకలవ్యలో 6 నుంచి 10 వరకూ 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. నూతన భవనం నిర్మించడంతో అక్కడకు తరలించామని ఆమె పేర్కొన్నారు. త్వరలో కేంద్రమంత్రులు వర్చువల్ విధానంలో భవనాన్ని ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ వివరించారు.

ఏవోబీలో వెలుగు దివ్వెలు

జల విద్యుత్ ఉత్పత్తిలో జిల్లా దూసుకుపోతోంది. రాష్ట్రానికే తలమానికంగా నిలిచిన ఈ జిల్లాలో ఇప్పటికే పొల్లూరు, డొంకరాయి, సీలేరు, మాచ్‌ఖండ్ ప్రాజెక్టుల ద్వారా సుమారు 1024 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తాజాగా మరో మూడు జల విద్యుత్ ప్రాజెక్టులు వీటి చెంతన చేరనున్నాయి. ఏవోబీలోని మత్స్యగెడ్డపై నిర్మించనున్న ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల జెన్‌కో అధికారుల మధ్య ఒప్పందం కుదిరింది. త్వరలోనే వీటి నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

- మత్స్యగెడ్డపై మూడు జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం
- ఆంధ్రా- ఒడిశా జెన్‌కో అధికారుల మధ్య ఒప్పందం
- పూర్తయితే అదనంగా 98 మెగావాట్ల ఉత్పాదన
- స్థానికంగా గిరి యువతకు ఉపాధి అవకాశాలు



మాచ్‌ఖండ్‌లో జల విద్యుత్ ఉత్పత్తి అనంతరం బలిమెల జలాశయానికి వెళ్తున్న మత్స్యగెడ్డ (మూడు జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించనున్న మత్స్యగెడ్డ ఇదే)

ముంచంగిపుట్టు: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మత్స్యగెడ్డపై మూడు జల విద్యుత్ కేంద్రాలు నిర్మించేందుకు ఇరు రాష్ట్రాల అధికారులు కార్యాచరణ రూపొందించారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి బలిమెల వెళ్లే మత్స్యగెడ్డ నిత్యం ప్రవహిస్తూ ఉంటుంది. దీనిపై నిర్మించే జలవిద్యుత్ కేంద్రాల వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని జెన్‌కో అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

● ఎన్నో ఏళ్లుగా నూతన జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి సర్వేలు, చర్చలతో సరిపెడుతూ వచ్చిన అధికారులు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

– మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి జోలాపుట్టు, డుడుమ జలాశయాల నీటిని వినియోగించుకొని విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. విద్యుత్ ఉత్పాదన అనంతరం విడుదల అయ్యే నీరు మాచ్‌ఖండ్ నుంచి బలిమెల జలాశయానికి వెళ్తుంది. మళ్లీ ఈ నీటిని వినియోగించుకునేలా మూడు జలవిద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నారు.

అపరస్పర అంగీకారం..

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం సమీప ప్రాంతాల్లో మూడు జల విద్యుత్ కేంద్రాలు నిర్మించాలని ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో), ఒడిశా హైడ్రో పవర్ కార్పొరేషన్(ఓహెచ్‌పీసీ)లు పరస్పరం అంగీకారానికి వచ్చాయి. 2020 అక్టోబరు 23లోఈ విద్యుత్ కేంద్రాలను సంయుక్తంగా నిర్మించాలని ఇరు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా గత నెల ఒడిశాలోని భువనేశ్వర్‌లో ప్రాజెక్టు పరిపాలనా కమిటీ (పీఏసీ) ప్రత్యేక సమావేశం నిర్వహించింది. రెండు రాష్ట్రాల ఇంధన శాఖ అధికారులు, ఏపీజెన్‌కో, ఓహెచ్‌పీసీ ప్రతినిధులతో నూతన విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై చర్చించి అంగీకారానికి వచ్చారు. మూడు విద్యుత్ కేంద్రాల ద్వారా 98 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన సాధ్యమవుతుందని జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి.



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో ఉత్పాదన అనంతరం మత్స్యగెడ్డలో విడుదల అవుతున్న నీరు

అత్యాధునిక పరిజ్ఞానంతో..

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం పూర్తిగా విదేశీ పరిజ్ఞానంతో అప్పటి పరిస్థితుల దృష్ట్యా నిర్మాణం జరిగింది. ఇప్పటికీ ఆలనాటి పద్ధతులు ఉపయోగిస్తూనే విద్యుత్ ఉత్పాదన చేస్తూ వస్తున్నారు.దీంతో తరచూ మాచ్‌ఖండ్‌లో జనరేటర్లు మరమ్మత్తులకు గురు కావడం ప్రాజెక్టు సిబ్బంది అవస్థలు పడుతూ ఉండేవారు.అలాంటి ఇబ్బందులకు స్వస్తి చెప్పాలని ప్రాజెక్టు అధికారులు ముందస్తు ఆలోచన చేశారు.దీంతో నూతనంగా నిర్మించనున్న విద్యుత్ కేంద్రాలకు మాత్రము ఇప్పుడు ఉన్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంను ఉపయోగించుకొని నిర్మాణాలు చేయనున్నారు.దీంతో విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం లేకుండా నిత్యం విద్యుత్ ఉత్పాదన జరుగుతుంది. దీనికితోడు విద్యుత్ ఉత్పాదన స్థాయి సైతం పెరిగే ఆస్కారం ఉందని అధికారులు భావిస్తున్నారు.

యువతకు ఉపాధి..

ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్మించనున్న నూతన విద్యుత్ కేంద్రాలు పూర్తయితే సరిహద్దులో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి. మాచ్‌ఖండ్ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సరిహద్దు ప్రాంతంలో నిరక్షరాస్యులు అధికంగా ఉండడంతో ప్రాజెక్టులో ఎటువంటి ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందలేక పోయారు. అక్షరాస్యత శాతం పెరిగింది. నిరుద్యోగ యువత ఎంతో మంది స్థానికంగా ఉపాధికోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు నిర్మాణం చేపట్టబోయే ప్రాజెక్టుల వల్ల తమ ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్న ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

అనుమతి వచ్చిన వెంటనే పనులు



మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రం నుంచి బలిమెల వచ్చే మత్స్యగెడ్డ నదిపై మూడు జల విద్యుత్ కేంద్రాల నిర్మాణానికి ఒప్పందం పూర్తయింది. అనుమతులు వస్తే నిర్మాణ పనులు మొదలు పెడతాం. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వీటి నిర్మాణాలు జరగనున్నాయి.తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం జలవిద్యుత్ కేంద్రాల వల్లే సాధ్యం.

– ప్రశాంత్ కుమార్, ఎస్ఈ, ఏపీ జెన్‌కో

ముస్లింలకు బక్రీద్ పండగ శుభాకాంక్షలు

● కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు: జిల్లాలోని ముస్లిం కుటుంబాలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో బక్రీద్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తగు జాగ్రత్తలు పాటిస్తూ మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలు జరుపుకోవాలని సూచించారు. పోస్ట్ కోవిడ్, జిల్లాలో కొన్ని చోట్ల జ్వరాలు దృష్ట్యా ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైందని, ఇందుకు ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ రూపొందించిన నిబంధనలు అనుసరించాలని సూచించారు. పండగ ప్రత్యేక ప్రార్థనల్లో మత పెద్దలు, కమిటీల ప్రతినిధులు, పలు జాగ్రత్తలతో పాటు అవసరమైన భద్రత ప్రమాణాలను పాటించాలని పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

● నలుగురు నిందితుల అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

మోతుగూడెం: ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నట్టు ఎస్ఐ మురళి తెలిపారు. లక్కవరం జంక్షన్ వద్ద బుధవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరిలో బాలుడు ఉన్నాడు. సింధువాడ నుంచి చెన్నై గంజాయిని తరలిస్తున్నట్టు గుర్తించినట్టు ఎస్ఐ తెలిపారు. రూ.40 వేల విలువైన 12కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ వివరించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- అమ్మ ఒడిలో 1,01,170 మందికి లబ్ధి
- ఖాతాల్లో రూ.151కోట్ల 75లక్షల 50వేల జమ
- పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ



అమ్మఒడి నమూనా చెక్కును విద్యార్థులు, వారి తల్లులకు పంపిణీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు

సాక్షి, పాడేరు: విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని, పేదరికాన్ని జయించవచ్చని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నుంచి జగనన్న అమ్మఒడి నిధులను బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా జిల్లాకు సంబంధించి స్థానిక కాఫీ అతిథి గృహ ఆవరణలో సీఎం ప్రసంగాన్ని తల్లిదండ్రులు, విద్యార్థులు వీక్షించారు. ఈ సందర్భంగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన అమ్మ ఒడి కార్యక్రమం నిర్వహించారు. బాలికలు, వారి తల్లులకు అమ్మ ఒడి నమూనా చెక్కును ఆయనతోపాటు ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని 22మండలాల పరిధిలో 1,01,170 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.151కోట్ల 75లక్షల 50వేలను ప్రభుత్వం జమచేసిందన్నారు. అమ్మ ఒడి పథకం పేద విద్యార్థులకు వరమన్నారు. ఇంటర్ తరువాత ఉన్నత చదువుల లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని, తద్వారా పేదరికాన్ని సైతం జయించవచ్చన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవడం ద్వారా మరింత విజ్ఞానం పెరిగి పోటీ ప్రపంచంపై సమగ్ర అవగాహన ఏర్పడుతుందన్నారు. జిల్లాలో 5.50 లక్షల మంది మహిళలు ఉన్నారన్నారు. వీరిలో అక్షరాస్యత శాతం పెరగాలని, దీనివల్ల గిరిజన ప్రాంతాల రూపురేఖలు మారిపోతాయన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ బాధ్యతగా తమ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించి విద్యాప్రమాణాల మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి: పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి, నాణ్యమైన విద్యా బోధన అందుబాటులోకి తెచ్చారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.62 వేలకోట్లు కేటాయించి అధిక ప్రాధాన్యమిచ్చారని ఆమె తెలిపారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యే లక్ష్యం: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తెలిపారు.అమ్మ ఒడితో పాటు జగనన్న ప్రభుత్వం ఆమలుజేస్తున్న ఉచిత విద్య,నాణ్యమైన వసతి సౌకర్యాలు విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలు,ఇతర విద్యాయాల్లో విద్యార్థులకు మూడూ పూటల నాణ్యమైన ఆహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో జమాల్‌బాషా, గిరిజన సంక్షేమ డీడీ కొండల రావు, ఎంఈవో సరస్వతి, పాడేరు, కొయ్యూరు ఎంపీపీలు సొనారి రత్నకుమారి, బడుగు రమేష్, జెడ్పీటీసీ కిముడు గాయత్రి, వైస్ఎంపీపీ రత్నాలమ్మ, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, ఎస్టీ విభాగం అధ్యక్షుడు కిముడు విశ్వ, ఎంపీటీసీలు చిట్టమ్మ, గిడ్డి విజయలక్ష్మి, సర్పంచ్‌లు వంతాల సీతమ్మ, సీదరి రాంబాబు, వంతాల రాంబాబు, ఏటీడబ్ల్యూవో రజిని తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు ఘన స్వాగతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న విజయసాయిరెడ్డి



ముఖ్యమంత్రిని కలిసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో అమ్మ ఒడి కార్యక్రమం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక విమానంలో ఉదయం 9.10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. 9.20 గంటలకు హెలికాప్టర్‌లో ఇక్కడి నుంచి కురుపాం బయలుదేరి వెళ్లారు. ఆయన్ని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, ఎంవీవీ సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, వరుదు కల్యాణి, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, అదీప్ రాజ్, కలెక్టర్ ఎ.మల్లికార్జున, నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. కురుపాం నుంచి హెలికాప్టర్‌లో సీఎం వైఎస్ జగన్ 2.53 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఇక్కడి నుంచి 3.14 గంటలకు ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరారు.



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఇద్దరి ప్రాణాలను మింగేసిన అతివేగం

అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. రెండు కుటుంబాలకు తీరని గర్భశోకం మిగిల్చింది. కిలగాడ ఘాట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతులు ఇద్దరూ యువకులే. రెండు ద్విచక్ర వాహనాలపై అతివేగంతో ఎదురెదురుగా వచ్చి ఢీకొనడం వల్లే ప్రాణనష్టానికి దారితీసిందని పోలీసులు భావిస్తున్నారు.

- కిలగాడ ఘాట్ సమీపంలో ఢీకొన్న రెండు ద్విచక్రవాహనాలు
- గాలిలో కలిసిపోయిన ప్రాణాలు
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- జంగంపుట్టు, పేటమాళిపుట్టులో విషాదం



కిలగాడ ఘాట్ సమీపంలో ఢీకొన్న బైక్‌లు



ప్రమాదంలో మృతి చెందిన అభిమన్యుడు, దేవేంద్రుడు

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ ఘాట్ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దారెల పంచాయతీ పేటమాళిపుట్టుకు చెందిన చోడియా అభిమన్యుడు, బిల్‌నాయక్ బాలరాజు ద్విచక్ర వాహనంపై కొండపడ గ్రామానికి బుధవారం వచ్చారు. తిరిగి అదే వాహనంపై బయలుదేరారు. మండలంలోని సుజనకోట పంచాయతీ గొడుగులపుట్టు గ్రామానికి చెందిన బహు బలేంద్ర రాంచందర్, పెదగూడ పంచాయతీ జంగంపుట్టు గ్రామానికి చెందిన పెటియా దేవేంద్రుడు అనకాపల్లి జిల్లా చోడవరం వెళ్లి, తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఎదురెదురుగా వస్తున్న వీరి రెండు ద్విచక్రవాహనాలు కిలగాడ ఘాట్ సమీపంలో బలంగా ఢీకొన్నాయి. దీంతో వాహనాలు నడుపుతున్న అభిమన్యుడు(22), దేవేంద్రుడు (21) తల భాగంగా తీవ్ర గాయాలయ్యాయి. అధిక రక్తస్రావంతో సంఘటన స్థలంలోనే మృతి చెందారు. ద్విచక్ర వాహనాల వెనుక కూర్చున్న బాలరాజు,రాంచందర్‌కు తల, కాళ్లు, చేతుల భాగాల్లో తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి వచ్చిన 108 అంబులెన్సు సిబ్బంది హుటాహుటిన ఇద్దరు క్షతగాత్రులను స్థానిక సీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యాధికారులు మౌనిక, వివేక్ వైద్య సేవలు అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నందున పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సీహెచ్‌సీకి వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఈ ఘటనతో జంగంపుట్టు, పేటమాళిపుట్టు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అభిమన్యుడు పేటమాళిపుట్టుకు చెందిన దంపతులు పరుశరామ్, దాలిమ ఏకైక కుమారుడు. కుమారుడి మరణ వార్తను తెలుసుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. దేవేంద్రుడు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు చెబుతున్నారు.



పరిస్థితి విషమంగా ఉన్న రాంచందర్

నేడు కూడా విద్యుత్ బిల్లుల స్వీకరణ

పాడేరు రూరల్ : పాడేరు డివిజన్ పరిధిలోని విద్యుత్ బిల్లులు చెల్లించే కేంద్రం గురువారం తెరిచే ఉంటుందని విద్యుత్ శాఖ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న బక్రీద్ సెలవు అయినప్పటికీ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. విద్యుత్ చార్జీల చెల్లింపుదారులు తమ విద్యుత్ బిల్లులను గురువారం యధావిధిగా చెల్లించుకోవచ్చన్నారు.

తుది విడత చందనం అరగదీత ప్రారంభం

సింహాచలం: సింహగిరిపై తుది విడత చందనం అరగదీత బుధవారం నుంచి ప్రారంభమైంది. వచ్చే నెల 3వ తేదీన ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామివారికి సమర్పించేందుకు కావాల్సిన మూడు మణుగుల పచ్చి చందనాన్ని (125 కిలోలు) సమకూర్చేందుకు శాస్త్రోక్తంగా అరగదీత చేపట్టారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 15 మంది నాల్గవ తరగతి సిబ్బంది 31 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో 96 కిలోల కిలోల చందనం అవసరం కాగా మరో మూడు రోజులపాటు అరగదీత జరగనుంది.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక


మాట్లాడుతున్న ఎంపీపీ ఆనందరావు

వై.రామవరం: స్థానిక ఉపాధి కార్యాలయంలో మండలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన 1754 పనుల సామాజిక తనిఖీలపై బుధవారం ప్రజా వేదిక నిర్వహించారు. ఏపీవో ప్రకాశరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, డ్వామా పీడీ ఎస్.రమేష్‌రామన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనులపై సామాజిక తనిఖీతో అవినీతి జరగకుండా ఉంటుందన్నారు. అయితే ప్రజావేదిక కార్యక్రమానికి ఎక్కువ మంది స్థానికులు, సర్పంచ్‌లు హాజరుకాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమానికి గ్రామస్తులు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలన్నారు. డ్వామా పీడీ రమేష్ రామన్ మాట్లాడుతూ మండలంలో ఏప్రిల్, 22 నుంచి మార్చి 31, 2023 వరకు రూ.17,22,70,122లతో చేపట్టిన 1754 ఉపాధి పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్‌పై ప్రజా వేదిక నిర్వహిస్తున్నామన్నారు. పనసలపాలెం గ్రామంలో పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు పనులకు ఆశాఖ ఇంజనీరింగు అధికారులు రికార్డు ఇవ్వలేదన్నారు. కానివాడలో జరిగిన పనుల్లో చిన్న చిన్న లోపాలు చోటు చేసుకోవడంతో ఫీల్డ్ అసిస్టెంటుకు రూ.40 వేలు రికవరీ పెట్టి, టెక్నికల్ అసిస్టెంటుకు షోకాజు నోటీసు ఇచ్చామన్నారు. మిగతా పనుల్లో ఏవిధమైన అక్రమాలు చోటు చేసుకోలేదన్నారు. ప్రజావేదికకు ఎక్కువగా గ్రామస్తులు వచ్చేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. డీఆర్‌టీ సీహెచ్.నిర్మలాదేవి, ఎస్ఆర్‌పీ బి.సూర్యచక్రమ్, డీఆర్‌పీలు, ఆడిటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న పండ్ల వ్యాపారం

చిత్రాలగొప్పలో పైనాపిల్, పనస విక్రయాలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న పైనాపిల్

చింతపల్లి: మధుర ఫలాలకు నిలయమైన చిత్రాలగొప్పలో పండ్ల వ్యాపారం జోరందుకుంది. పైనాపిల్, పనస పండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. ధర కూడా ఆశాజనకంగా ఉన్నందున గిరి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని గొందిపాకలు, చిక్కుడుబట్టి, రాజుపాకలు, బద్దిమెట్ట, రాజుబంద గ్రామాల గిరిజనులు పైనాపిల్, పనస, సీతాఫలం తదితర ఉద్యానవన పంటలను వాణిజ్యపరంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పైనాపిల్, పనస సీజన్ కావడంతో గిరిజనులు పండించిన పంటలను చిత్రాలగొప్ప కేంద్రంగా విక్రయాలు జరుగుతున్నాయి. ఆయా గ్రామాల్లో సుమారు 70 ఎకరాల్లో పైనాపిల్ సాగు చేస్తున్నారు. పనసకూడా పెద్ద మొత్తంలో సాగవుతోంది. ఇక్కడ సేంద్రియ ఎరువులతో పండించిన పైనాపిల్‌ను కొనుగోలు చేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులు వస్తుంటారు. హైదరాబాద్, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు పండ్లు కొనుక్కునేందుకు ప్రత్యేకంగా బస్సులు ఆపుతారు. ప్రస్తుతం ఒక్కో పైనాపిల్ రూ.15 నుంచి 20 వరకు అమ్ముడవుతోంది. ధర లాభదాయకంగా ఉందని గిరి రైతులు పేర్కొన్నారు

రాగుల సాగుకు ప్రాధాన్యమివ్వాలి


రంగశీలలో రాగుల సాగును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

హుకుంపేట: ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం వల్ల గిరి రైతులు రాగుల సాగు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ సూచించారు. బుధవారం మండలంలోని రంగశీల పంచాయతీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సేంద్రియ విధానంలో గిరి రైతులు ధర్మ, సమరెడ్డి చేపట్టిన రాగుల సాగు క్షేత్రాలను ఆయన పరిశీలించారు. మంచి ఫలితాలు సాధిస్తున్న వారిని జేసీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెటింగ్ సౌకర్యం ఉన్నందున రాగుల సాగు చేపట్టాలని సూచించారు. సాగునీటి సమస్య పరిష్కారానికి వ్యవసాయ బోర్లు, పవర్ టిల్లర్లు మంజూరు చేయాలని కొంతమంది గిరి రైతులు కోరారు. ఐటీడీఏలో దరఖాస్తు చేసుకోవాలని వారికి ఆయన సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకశాఖ అధికారి నాయుడు

పాడేరు రూరల్ : అగ్నిప్రమాదాలు సంభవిస్తే అలసత్వం చేయకుండా వెంటనే సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రానికి సమాచారం చేరవేయాలని పాడేరు అగ్నిమాపక కేంద్రం అధికారి కేపీ నాయుడు సూచించారు. పట్టణంలో శ్రీకృష్ణాపురంలోని భారత్ పెట్రోల్ బంకులో బుధవారం అగ్నిప్రమాదాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. పెట్రోల్ బంకుల్లో ప్రమాదాలు జరిగితే ప్రాథమికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అక్కడి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది బాలకృష్ణ, గిరీష్, కొండలరావు, రవి, త్రినాథ్ పాల్గొన్నారు.

మృతురాలి వివరాలు లభ్యం

కశింకోట : కశింకోట వద్ద ఏలేరు కాలువలో లభించిన మహిళ మృతదేహాన్ని బుధవారం గుర్తించినట్టు మహిళా ఏఎస్ఐ ఎస్. సుందరమ్మ తెలిపారు. బుచ్చియ్యపేట మండలం మల్లాం గ్రామానికి చెందిన చందక నాగభూషణం (55)గా బంధువులు గుర్తించారన్నారు. ఈ నెల 24న తన గ్రామం నుంచి తాళ్లపాలెంలో సరుకులు కొనుగోలు చేసుకోవడానికి వచ్చి సమీపంలోని ఏలేరు కాలువలోకి కాళ్లు కడుక్కోవడానికి దిగి ప్రమాదవశాత్తూ జారి పడి కశింకోట వరకు మృతదేహం ప్రవాహంలో కొట్టుకు వచ్చి సోమవారం బయట పడిందన్నారు. బంధువులు రావడంతో ఆమె మృతదేహాన్ని గుర్తించినట్టు తెలిపారు. దీంతో పోస్టుమార్టం జరిపించామని, కేసు దర్యాప్తులో ఉందని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు


గంజాయితో పట్టుబడ్డ నిందితులు, స్వాధీనం చేసుకున్న వ్యాను

చోడవరం రూరల్ : వ్యానులో గంజాయిని తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు చోడవరం పోలీసులు అంతర్రాష్ట్ర ముఠా సభ్యులు ఇద్దరిని అరెస్టు చేసి, 21 కేజీల గంజాయి, ఐషర్ వ్యానును స్వాధీనం చేసుకున్నారు. చోడవరం ఎస్ఐ బి.అప్పలనాయుడు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పాడేరు నుంచి గంజాయిని వ్యానులో అక్రమంగా తరలిస్తున్నట్టుగా మంగళవారం సాయంత్రం సమయంలో చోడవరం పోలీసులకు నమ్మకమైన సమాచారం అందింది. ఈ మేరకు నర్సయ్యపేట గ్రామ పొలిమేర వద్ద గౌరీపట్నం జంక్షన్ వద్ద పోలీసులు గస్తీ ముమ్మరం చేశారు. ఈ సమయంలో కర్ణాటక రాష్ట్ర రిజిస్ట్రేషన్ కెఎ51ఎజి 2182 నంబర్ గల ఐషర్ గూడ్సు వ్యాను జంక్షన్‌కు సమీపించడంతో నిలువరించి తనిఖీ చేయగా వ్యానులో 21 కేజీల గంజాయి పట్టుబడిందన్నారు. గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నేరంపై వ్యాను డ్రైవర్, కర్ణాటక రాష్ట్రం, బెంగళూరుకు చెందిన రితీష్‌కుమార్ విల్సన్ అలియాస్ పీటర్(23), చిత్తూరు జిల్లా నాడికి చెందిన శ్రీధర్ అలియాస్ ఆర్.కుమార్(24)లను అరెస్టు చేశామన్నారు. నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, 21 కేజీల గంజాయి, ఐషర్ వ్యానును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ చెప్పారు. నిందితులిద్దరినీ బుధవారం జ్యుడిషియల్ కస్టడీకి తరలించామని ఎస్ఐ అప్పలనాయుడు తెలిపారు.

పారదర్శకంగా జగనన్న సురక్ష


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాఘవన్


రాయపల్లిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రాఘవన్

మండల ప్రత్యేకాధికారి రాఘవన్

అడ్డతీగల: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గ్రామవలంటీర్లు పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి, రంపచోడవరం డీఎల్‌పీవో జి.రాఘవన్ ఆదేశించారు. మండలంలోని రాయపల్లిలో బుధవారం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామవలంటీర్లకు ఆయన పలు సూచనలు జారీ చేశారు. గ్రామసచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామవలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన సమగ్ర అంశాలపై సర్వే నిర్వహించాలని సూచించారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. వచ్చే నెల నాలుగో తేదీకల్లా దరఖాస్తుదారులకు పూర్తిస్థాయిలో ధ్రువపత్రాలు అందజేయాలని సూచించారు. ఈవోపీఆర్డీ చిన్నబాబు, రాయపల్లి సర్పంచ్ చెదల విశ్వనాథం, కార్యదర్శి గణేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంపద కేంద్రం పరిశీలన

రాయపల్లిలో శిథిలమైన సంపద కేంద్రాన్ని రంపచోడవరం డీఎల్పీవో జి.రాఘవన్ పరిశీలించారు. నాలుగేళ్ల క్రితం నిర్మించిన వెంటనే ఈ భవనంపై చెట్టు కూలిపోవడంతో పూర్తిగా దెబ్బతింది. పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ చెదల విశ్వనాథం కోరారు. దీనిపై పంచాయతీ నుంచి ప్రతిపాదనలు పంపాలని డీఎల్పీవో సూచించారు.